## పురుషులను రెచ్చగొట్టే ఎరుపురంగు



ఎదుటి వారిని రెచ్చగొట్టే శక్తి ఎరుపుకి ఉంది అనే విషయం ఇప్పుడు పరిశోధనా పూర్వకంగా రుజువైంది. మనుషులలో ఎరుపురంగుకి ఒక ప్రత్యేక స్థానం ఉందని రోచెస్టర్ యూనివర్శిటీకి చెందిన మానసిక శాస్త్రవేత్తలు చెపుతున్నారు. ఈ విషయం మీద వీరు ఐదు రకాల పరిశోధనలు నిర్వహించారు. వీరి పరిశోధనా ఫలితాలు ఈ విధంగా ఉన్నాయి.

ఒక వ్యక్తి ఇష్టపడే రంగుకి అతని ప్రవర్తనకి దగ్గర పోలిక ఉంటాయని వారు అంటున్నారు. చాలా వరకు రంగులు మానసిక ప్రవృత్తిని తెలియజేస్తాయి. అయితే ఎరుపు రంగు పురుషులలో శృంగారపు కోరికలను పెంచుతుందని పరిశోధకులు అంటున్నారు. ఎరుపు రంగు దుస్తులు ధరించిన స్త్రీల నుంచి పురుషులకు శృంగార సంకేతాలు వెలువడతాయని, అందుకే అలాంటి స్త్రీల పట్ల పురుషులు ఎక్కువగా ఆకర్షితులవుతారని వారు వివరించారు. ఈ మేరకు వీరు విస్తృత పరిశోధనలు నిర్వహించారు. ఒక గ్రూపుకు చెందిన పురుషులకు రకరకాల రంగు దుస్తులు ధరించిన స్త్రీల ఫోటోలు ఇచ్చి వారి మనోభావాలను పరిశీలించారు. ఒక్కొక్క ఫొటోను చూసినప్పుడు పురుషులలో కలిగే మనోభావాలను వారు రికార్డు చేశారు. ఎరుపు రంగు దుస్తులు ధరించిన స్త్రీల ఫొటోలు చూసినప్పుడు పురుషులలో శృంగారపు స్పందనలను వారు గుర్తించారు. ఈ మేరకు ఎరుపు రంగు పట్ల పురుషులు ఎక్కువ ఆకర్షితులవుతారని వారు నిర్ధారించారు. దీని మీద ఇంకా పరిశోధనలు నిర్వహించవలసి ఉందని పరిశోధకులు చెపుతున్నారు.

## ప్రపంచంలోనే అతి పెద్ద చీజ్‌కేక్



'వివాహ భోజనంబు... వింతైన వంటకంబు' అంటూ మాయాబజార్‌లో ఘటోత్కజుడు పాడినట్లుగా ఏదైనా అద్భుత మైన వంటకం తయారు చేసి ప్రపంచ రికార్డు సృష్టించాలని నడుం కట్టారు 55 మంది చెఫ్‌లు. 'రాజు తలుచుకుంటే దెబ్బలకు కొదవా?' అన్నట్లు కేకుల తయారీలో చేయి తిరిగిన ఆ 55మంది అద్భుతమైన చీజ్‌కేక్ తయారు చేశారు. ప్రపంచంలోనే అతి పెద్ద చీజ్‌కేకుగా నమోదైన దాని తయారీ వివరాలు.... మెక్సికో సిటీకి చెందిన 55 మంది చెఫ్‌లు 60 గంటల పాటు నిర్విరామంగా శ్రమించి ప్రపంచంలోనే అతి పెద్ద చీజ్‌కేకును తయారు చేశారు. ఇందుకుగాను వారు ఒక టన్ను క్రీమ్ చీజ్‌ను, అంతే పరిమాణంలో యోగార్ట్‌ను, 350 కిలోల పేస్ట్రీని, 250 కిలోల చక్కెర, 150 కిలోల వెన్నను ఉపయోగించారు. పైపెచ్చు రెండు టన్నుల క్యాలరీలు కలిగిన స్ట్రాబెర్రి పండ్లను ఆ చీజ్‌కేకు మీద చివరగా అలంకరించారు. గతంలో ఇంత పెద్ద చీజ్‌కేకును ఎవరూ తయారు చేసి ఉండకపోవడంతో చాలా తేలికగా ఈ రికార్డును గిన్నీస్ బుక్‌లో నమోదు చేసారు. ఈ కేకును 20వేల ముక్కలుగా చేసి మెక్సికో సిటీలో నిర్వాహకులు పంచిపెట్టడం ఈ ఈవెంట్ కొసమెరుపు.

## 'సరసి'కత

వైశంపాయనుడి భార్య సుబ్బాయమ్మ గారికి ఎప్పుడో పుట్టింటి వారిచ్చిన డబ్బుని ఫిక్సుడు డిపాజిట్ చేయగా ఇప్పుడది తొంభయివేల రూపాయలై చేతికొచ్చింది . ఆమెకెప్పటి నుంచో కెంపుల నెక్లెస్ చేయించుకోవాలని కోరిక.

వైశంపాయనుడు ఆ డబ్బుని ఎలాగైనా సరే ఇంటి ఖర్చులకు వాడెయ్యాలని విశ్వప్రయత్నం చేశాడు. ఆ కష్టాలూ, ఈ కష్టాలూ ఏకరువు పెట్టి, ఆమెను వొప్పించడానికి ట్రై చేశాడు. ఆమె ససేమిరా అంది. ఇక గత్యంతరం లేక సింపుల్‌గా కెంపుల్ నెక్లెసు చేయించాడు.

ఓ రోజు అవతలి వీధిలో ఉన్న కుబ్జ గారొచ్చి ''ఏమే సుబ్బాయమ్మా, కెంపుల




నెక్లెసు చేయించుకున్నావటగా. నాకు చూపించనే లేదేమే?'' అంది నిష్ఠూరంగా.

సుబ్బాయమ్మ గారు గాఢంగా నిట్టూర్చింది. ''నేను మాత్రం చూశానా పిన్నీ. కంసాలి నుంచి తీసుకున్నాక అట్నించి అటే పట్టుకెళ్లిపోయి, బ్యాంకు లాకర్లో పెట్టేశారు!!'' అంది కళ్లు వొత్తుకుంటూ.

భద్రత విషయంలో రాజీ పడడు వైశంపాయనుడు. అతడికి సేఫ్టీ ఫస్టు, సొగసు నెక్స్టూనూ!

*